క్లుప్తంగా

ఆశ్రమ పాఠశాల తనిఖీ



బయ్యారం: మండలంలోని ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాలతోపాటు బయ్యారంలోని ఆశ్రమ వసతి గృహంను మంగళవారం గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎర్రయ్య తనిఖీ చేశారు. పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా పదో తరగతి ఉత్తీర్ణులు అయ్యేలా విద్యార్థులు చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బాబు, వసతిగృహం సంక్షేమాధికారి సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి..



దంతాలపల్లి: మండలంలో గల ప్రభుత్వ ఆస్పత్రిని డిప్యూటీ డీఎంహెచ్ఓ మురళిధర్ మంగళవారం పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించాడు. వైద్యాధికారులు చైతన్య, స్పందన పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మరిపెడ: దివ్యాంగుల కృత్రిమ అవయవాల పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. మరిపెడ మున్సిపల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల కృత్రిమ అవయవాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం 11వ వార్డు కౌన్సిలర్ ఎడెల్లి పరశురాములు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్, మున్సిపల్ చైర్మన్ సింధూర, కౌన్సిలర్లు సుజాత, లలిత, లక్ష్మీనారాయణ, ప్రగతిశ్రీపాల్‌రెడ్డి, హుస్సేన్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మహబూబాబాద్ అర్బన్: జాతీయ నిర్మాణ సంస్థ న్యాక్ ఆధ్వర్యంలో మానుకోట పట్టణంలోని 18 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగులకు ప్లంబర్ జనరల్ కోర్సులో 3నెలలు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశం కల్పించనున్నట్లు న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి.రమేష్ మంగళవారం తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు తమ టెన్త్ మెమో, ఆధార్, రేషన్ కార్డు, కులం, ఆదాయం, నివాసం ధ్రువపత్రాల జిరాక్స్‌లను, 5పాస్ ఫొటోలతో ఈనెల 30వ తేదీ వరకు మానుకోట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 99896 15161 ఫోన్ నంబరును సంప్రదించాలన్నారు.

ఆలయ భూముల సర్వే



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి ఉన్న భూములను మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. ముత్యాలమ్మ చెరువు కింద సాగు అయ్యే 3.10 ఎకరాల ఆలయ భూములు సర్వే నంబర్ 602, 603, 604లలో మహబూబాబాద్ ఆర్డీఓ కొమురయ్య పర్యవేక్షణలో డీఐఓఎస్ దత్తు, సర్వేయర్లు సర్వే చేశారు.

విద్యాభివృద్ధికి కృషి అభినందనీయం

● ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్



గూడూరు: పరీక్ష సామగ్రి పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

గూడూరు: పరీక్షల్లో ఉన్నత శ్రేణిలో రాణించాలని ప్రోత్సహిస్తూ వారికి అవసరమైన పరీక్ష సామగ్రిని అందించడం, విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మందుల ప్రవీణ్ తన సొంత ఖర్చులతో మహాత్మా జ్యోతీబా పూలే ట్రైబల్ బీసీ వెల్ఫేర్ విద్యాలయంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు.

పరామర్శ..

బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు కాల్సాని వేణుమాధవ్‌రెడ్డి తండ్రి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కాల్సాని వెంకటేశ్వర్లు ఆదివారం రాత్రి మృతిచెందిన విషయం తెలిసిందే. మంగళవారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

గుడిసెలు వేసి నష్టపోవద్దు

మహబూబాబాద్: ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బానోత్‌శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూముల్లో వేల సంఖ్యలో గుడిసెలు వేశారని, వాటిని రెవెన్యూ, మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో వెంటనే తొలగించి విషయం పేదలకు వివరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాల కొరత ఏర్పడిందని, ప్రజలు అర్థం చేసుకొని గుడిసెలు తొలగించాలన్నారు. దళారులు మాటలు నమ్మి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. 125గజాలోపు స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న వారికి జీఓ 58 క్రింద ఉచితంగా పట్టాల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అంత కన్నా ఎక్కువగా ఉంటే మార్కెట్ విలువ ప్రకారం డబ్బులు చెల్లిస్తే రిజిస్ట్రేషన్ చేయించి పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

కార్యకర్తలు పార్టీ బలోపేతం కోసం సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం మానుకోట మండలం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రియాంక, శ్రీనివాస్, లూనావత్ అశోక్, సర్పంచ్‌లు , ఎంపీటీలు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరం ప్రారంభం



ప్రారంభిస్తున్న చైర్మన్ నవీన్

మరిపెడ రూరల్: మండలం ఆనెపురం గ్రామ పంచాయతీ భవనంలో మరిపెడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ గుడిపుడి నవీన్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలోఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ తేజావత్ శారద, సర్పంచ్ దామెర్ల వీరన్న, ఎంపీటీసీ చిట్టిఅమర్‌సింగ్, ఉపసర్పంచ్ సీహెచ్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

అవార్డు రావడం అభినందనీయం

గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి ఫలితంగానే మండలంలోని బీచ్‌రాజ్‌పల్లి గ్రామానికి సామాజిక భద్రత విభాగంలో జిల్లా స్థాయిలో అవార్డు దక్కిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నవీన్ అన్నారు. ఈ సందర్భంగా నవీన్‌ను సర్పంచ్ నాతి కృష్ణ, కార్యదర్శి లెనిన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంట్రాక్టర్ నారెడ్డి సుదర్శన్ రెడ్డి, రాంపెల్లి రవి, నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

మరిపెడ: విధి నిర్వహనలో ఉద్యోగులు అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని గుడిపుడి నవీన్ అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించి సత్యనారాయణరెడ్డి బదిలీపై వెళ్లడంతో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో నవీన్ పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ సింధూరరవికుమార్, తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఎంపీడీఓ ధన్‌సింగ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దవంగర: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే వ్యాధులు దరి చేరవని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని బావోజీ తండాలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని సర్పంచ్ జమునతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఏపీఎం నరేంద్ర కుమార్, ఎంపీఓ సత్యనారాయణ, సీబీఎం కోఆర్డినేటర్ సీహెచ్ రవి, శ్రవన్, పీపీ కార్యదర్శి పరమేష్, సీసీ సుధాకర్, పాల్గొన్నారు.

రైతు కోఆర్డినేటర్ల ఎంపిక

గూడూరు: మండలంలోని వెంగంపేట, కేశవపట్నం గ్రామ రైతు కోఆర్డినేటర్లుగా ఎర్రబోతుల యాదగిరి, గుగులోతు జవహర్‌లను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మంగళవారం నియామక పత్రాన్ని అందించారు.

వైద్య పరీక్షలు

కురవి: మహిళలు ఆరోగ్యంగా ఉండాలని డీడబ్ల్యూఓ నర్మద అన్నారు. మంగళవారం కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విరాజిత, ఎంపీడీఓ సరస్వతీ, స్టాఫ్‌నర్స్‌లు కవిత, అనురాధ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దంతాలపల్లి: ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారులు చైతన్య, స్పందన మంగళవారం తెలిపారు.

చదవడంలో ప్రగతి సాధిస్తేనే బంగారు భవిష్యత్



విద్యార్థి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర కోఆర్డినేటర్ శంకరయ్య

నెల్లికుదురు: విద్యార్థుల్లో ప్రాథమిక సామర్థ్యాలైన రాయడం, లెక్కలు చేయడం, చదవడంలో ప్రగతిని సాధిస్తే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్‌సీఈఆర్‌టీఎస్ఎస్‌సీ స్టేట్ కోఆర్డినేటర్ బి.శంకరయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల ఉన్నత పాఠశాలల్లో అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర బృందం మంగళవారం సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. జులై నెలలో మొదలైన ఎఫ్ఎల్ఎన్‌తో విద్యార్థుల్లో సాధించిన ప్రగతి నివేదికలను పరిశీలించినట్లు తెలిపారు. ఇవి విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు అనిల్ కుమార్, రమేష్, హెచ్ఎంలు గంగాధర్, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, ఇంద్రసేనారెడ్డి, వెంకట్రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

బయ్యారం: మండలంలోని పలు రహదారులు హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి ఐటీడీఏ ద్వారా నిధులు విడుదల చేయటాన్ని హర్షిస్తూ మంగళవారం బయ్యారంలో సీఎం కేసీఆర్, మంత్రి సత్యవతిరాథోడ్ చిత్రపటాలకు జెడ్పీ చైర్‌పర్సన్ బిందు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎంపీటీసీలు శైలజ, కుమారి, మండల పరిషత్ కోఆప్షన్‌సభ్యుడు బాబా, సర్పంచులు స్వరూప, రాజు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

డోర్నకల్: అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన ఓ కుటుంబానికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు వంట పాత్రలను పంపిణీ చేశారు. స్థానిక సుభాష్‌వీధికి చెందిన చీమ వెంకటేశ్వర్లు ఇంట్లో రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న సామగ్రి కాలి బూడిదయ్యాయి. మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందించారు. రమేష్, సుధాకర్, గోపాలవర్మ, నరేష్, యశోధర్‌జైన్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదు



దీక్షలో పాల్గొన్న నాయకులు

గార్ల: దేశంలో నియంత, ప్రజావ్యతిరేక పాలన కొనసాగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పతనం తప్పదని ఇల్లందు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు జి.రవినాయక్ అన్నారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం దీక్ష చేపట్టారు. టీపీసీసీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు రావూరి వెంకట్రామయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణగౌడ్, ఎంపీటీసీలు వెంకట్‌లాల్, సుజాత రామారావు, శంషాద్‌బేగం, రవి, జవహర్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి



కురవి: ధర్నా చేస్తున్న సంఘం బాధ్యులు

కురవి: పేపర్ లీకేజీ వ్యవహారంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పట్ల మధు డిమాండ్ చేశారు. మంగళవారం కురవి గుడి సెంటర్‌లో సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరేందర్, మురళి, వెంకటేష్, గణేష్, అనిల్, మహేష్, ప్రణీత్ పాల్గొన్నారు.

లీకేజీ కేసు సీబీఐకి అప్పగించాలి

దంతాలపల్లి: టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్ రెడ్డిని వెంటనే అరెస్ట్ చేసి పేపర్ లీకేజీ కేసును సీబీఐకి అప్పజెప్పాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తేజవత్ అభినాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలతో 30లక్షల మంది నిరుద్యోగుల జీవితాలు అంధకారంలో పడ్డాయన్నారు. జిల్లా కార్యదర్శి పరశురాములు, శ్రీను, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



పెద్దవంగర: ఎల్బీతండాలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

మరిపెడ రూరల్: చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ అన్నారు. మండలంలోని ఆనెపురం గ్రామ సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ చిరుధాన్యల సంవత్సరం–2023, మహిళ, శిశు మాసోత్సవాలను మంగళవారం జీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుగులోతు అరుణ, జెడ్పీటీసీ శారద , సర్పంచ్ వీరన్న, హరీశ్, శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెద్దవంగర: మనం తీసుకునే ఆహారంలో ఎలాంటి పోషకాలు లేవని తినేదంతా పిప్పేనని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాల గ్రామంలోని రైతువేదికలో సొసైటీ ఫర్ లక్ష్యం, సోషల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో వాల్యూ అడిషన్ అండ్ ఫుడ్ ప్రాసెసింగ్ ఇన్ మిల్లెట్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డితో కలసి ప్రారంభించారు. రోగాల బారిన పడకుండా చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సైంటిస్ట్ స్వరూప, చైర్మన్ శేఖర్, ఏపీఎం నరేంద్ర కుమార్, సీసీ సుధాకర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆహారంలో తీసుకోవాలి

ఆరోగ్యవంతంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలను ఆహారంలో తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత అన్నారు. మంగళవారం మండలంలోని ఎల్బీతండా, బీసీ తండాల్లో చిరుధాన్యాల్లోని పోషకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, పాఠశాల హెచ్ఎం బీమా నాయక్, ఉప సర్పంచ్ శంకర్, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

చిన్నగూడూరు: చిరుధాన్యాలతోనే పరిపూర్ణమైన ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ వల్లూరి పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని జయ్యారం గ్రామంలో మానుకోట మహిళ, శిశు మాసోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్, టీచర్స్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాధ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

నెల్లికుదురు: ఓ వ్యక్తి పోగొట్టుకున్న రూ.50వేల సెల్ ఫోన్‌ను తిరిగి ఇచ్చి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మంద శ్రీనివాస్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ప్రయాణికులను ఎక్కించుకున్న క్రమంలో ఆటోలో ప్రయాణికుడు సెల్ ఫోన్ మరిచిపోయాడు. ఫోన్ జిల్లా కేంద్రానికి చెందిన గౌతం అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించి వెంటనే అతనికి అప్పగించాడు.

సన్మానం

చిన్నగూడూరు: రాష్ట్రంలోని ఉద్యోగుల సంక్షేమమే కేసీఆర్ ధ్యేయంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ పద్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మూల మురళీధర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీపీ, మురళీధర్ రెడ్డిలను వారి నివాసంలో సెర్ప్ ఉద్యోగులు సన్మానించారు.

నవమి వేడుకలు ప్రారంభం

డోర్నకల్: మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో శ్రీసీతారామాంజనేయ దేవస్థానంలో మంగళవారం శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే వేడుకల్లో మొదటి రోజు మేదిపూజ, అంకురార్పణం, విశ్వక్షేణ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

ముగిసిన పరీక్షలు

డోర్నకల్: స్థానిక డీడీ జూనియర్ కళాశాలలో మంగళవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ముగిశాయి. ఈనెల 15నుంచి ప్రారంభమైన మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి.

డెయిరీ ఫాం సందర్శన

గార్ల: కరీంనగర్ జిల్లాలోని ముల్కనూరు సొసైటీ డెయిరీ ఫాం అభివృద్ధిపై అవగాహన కల్పించేందుకు మంగళవారం గార్ల సొసైటీ పాలకవర్గం, రైతులు వెళ్లారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, గంగావత్ లక్ష్మణ్‌నాయక్, డైరెక్టర్లు సత్యనారాయణ, రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

కేసముద్రం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కేసముద్రం లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లీ అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసినికి, చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ముందుగా కేసముద్రం మార్కెట్ చైర్‌పర్సన్ నీలం సుహాసిని, దుర్గేష్ దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కూన అనిల్ కుమార్, ట్రెజరర్ మాన్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు వీరన్న పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక



గార్ల: ఉగాది మహానంది జాతీయ పురస్కారానికి గార్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కవి, రచయిత, పంజాల ఐలయ్య ఎంపికైనట్లు వేదిక చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు.

ఘనంగా వీడ్కోలు

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ జెడ్పీఎస్ఎస్‌లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలను రాయాలన్నారు. అనంతరం విజయలక్ష్మీ కాటన్ ఇండస్ట్రీస్ యజమాని సంకెపల్లి జనార్దన్‌రెడ్డి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరేందర్, సత్యనారాయణ, నాగమణి, జ్యోతి, పద్మలత, రామయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

బయ్యారం: మండలంలోని బాలకోన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థినులకు జర్నలిస్ట్ ప్రభాకర్ పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయకుమారి, ప్రసాదరావు, ఎస్ఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి పాల్గొన్నారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

కురవి: హిందూ, ముస్లిం సోదరులు వారి పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని మహబూబాబాద్ రూరల్ సీఐ రమేష్‌నాయక్ అన్నారు. మంగళవారం కురవి పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలు, హిందు సోదరులతో శాంతి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రాము పాల్గొన్నారు.

గూడూరు ఎస్సైగా రాణాప్రతాప్



గూడూరు: గూడూరు ఎస్సైగా బి.రాణాప్రతాప్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన బి.సతీష్‌గౌడ్ ఎస్పీ కార్యాయానికి బదిలీపై వెళ్లారు.

క్రైం కార్నర్..

నమ్మించి.. నకిలీ బంగారం ఇచ్చి

● రూ.2 లక్షలు కుచ్చుటోపీ
● పోలీసులకు ఫిర్యాదు



మహబూబాబాద్ రూరల్: దగ్గరి బంధువని నమ్మితే నట్టేట ముంచాడు. అసలు బంగారం ఎరగా.. చూపి నకిలీ బంగారం బిళ్లలు అంటగట్టాడు. రూ. 2 లక్షలు తీసుకొని ఇచ్చిన బిళ్లలు నకిలీవని తేలడంతో లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు. మహబూబాబాద్‌లోని రెడ్డిబజార్‌లో నివాసం ఉంటూ ప్లంబర్ మేస్త్రీగా పనిచేస్తున్న నునావత్ సేవ్యా, అయోధ్య గ్రామ శివారు ఎర్రగుంట తండాలో నివాసం ఉంటున్న రైతు అజ్మీరా సేవ్యా బావ బామ్మర్దులు. బంధుత్వాన్ని ఆసరాగా చేసుకొని నునావత్ సేవ్యా ఇంటికి అజ్మీరా సేవియా వచ్చాడు. తన దగ్గర బంగారం బిళ్లలు ఉన్నాయని, తక్కువ ధరకే ఇస్తానని నమ్మబలికాడు. ముందుగా నాలుగు బిళ్లలు ఇచ్చి వాటిని పరీక్షించుకొమ్మని చెప్పాడు. వాటిని తీసుకొని బంగారం షాపు వద్ద పరీక్షించగా.. అసలైన బంగారంగా తేలింది. దీంతో నిమ్మిన నునావాత్ సేవ్యా.. తన దగ్గరున్న రూ.2 లక్షలతో (80 బిల్లలు) ఆరు తులాల తూకం గల బిల్లలను తీసుకున్నారు. డబ్బులు తీసుకొని అజ్మీరా సేవ్యా ఉడాయించాడు. అయితే ఆభరణాలు చేయించేందుకు నునావత్ సేవ్యా బిళ్లల్ని తీసుకుని గోల్డ్ స్మిత్ వద్దకు వెళ్లగా.. అవి నకిలీవని తేలింది. దీంతో లబోదిబోమంటూ.. అజ్మీరా సేవ్యాకు ఫోన్ చేయగా.. తనకేమీ సంబంధంలేదని, వేరే వారు తనకిచ్చారని పొంతన లేని సమాధానం చెప్పాడు. దీంతో నునావత్ సేవ్యా.. మంగళవారం మహబూబాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అజ్మీరా సేవ్యాపై కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ టౌన్ సీఐ వై.సతీశ్ తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్: అప్పుల బాధతో నెల్లికుదురు మండలం చిన్ననాగారం గ్రామానికి చెందిన మధ్యబోయిన రమేశ్(28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ మెడికల్ షాప్ నిర్వహిస్తూ.. రెండేళ్లుగా మెడికల్ ఏజెన్సీలో పని చేస్తున్నాడు. ఈక్రమంలో అతడికి రూ. 4 లక్షల వరకు అప్పులయ్యాయి. మనస్తాపానికి గురైన రమేశ్ సోమవారం బైక్‌పై ఇంటి నుంచి బయల్దేరి వచ్చి మహబూబాబాద్ మండలంలోని ముడుపుగల్ గ్రామ శివారులో పురుగుల మందు తాగి బావిలో పడిపోయాడు. గమనించిన స్థానికులు అతడిని బయటకు తీశారు. విషయం తెలుసుకుని అతడిని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి రమేశ్ మృతిచెందాడు. మృతుడి అన్న ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మహబూబాబాద్ రూరల్ ఎస్సై సీహెచ్.అరుణ్ కుమార్ తెలిపారు.

సీపీఎం నాయకులపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూమి సర్వేనంబర్ 255/1లో గుడిసెలు వేసిన ఘటనలో ఐదుగురు సీపీఎం నేతలపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ వై.సతీష్ మంగళవారం తెలిపారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించారని తహసీల్దార్ నాగభవాని ఫిర్యాదు చేశారన్నారు. దీంతో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, రావుల రాజు, బానోత్ సీతారాం, బూర్గుల లక్ష్మణ్, తోట శీనుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

అప్పు ఇవ్వలేదని దాడి.. కేసు నమోదు

దంతాలపల్లి: మండలం బొడ్లాడ గ్రామంలో అప్పు ఇవ్వలేదని వ్యక్తి పై దాడి చేసిన సంఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఎస్సై కూచిపుడి జగదీష్ తెలిపారు. సూర్యాపేట్ జిల్లా కేంద్రానికి చెందిన కాసరబోయిన మురళి దంతాలపల్లి మండలం బొడ్లాడ గ్రామానికి చెందిన దండే నరేష్‌కు కుటుంబ అవసరానికి డబ్బులు అప్పుగా ఇవ్వగా మంగళవారం రోజు తమ డబ్బులు ఇవ్వాలని సదరు వ్యక్తి నరేష్‌ను అడిగాడు. తమవద్ద ఇప్పుడు డబ్బులు లేవని 3నెలల తర్వాత ఇస్తానని చెప్పగా వినిపించుకోకుండా దాడి చేశాడన్నారు. నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మురళి, అతని వెంట వచ్చిన నిఖిల్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణహాని ఉంది.. రక్షణ కల్పించండి

మహబూబాబాద్ రూరల్: పలువురు రౌడీషీటర్లు, భూకబ్జాదారుల నుంచి ప్రాణహాని ఉందని, వారి నుంచి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా రక్షణ కల్పించాలని కోరుతూ జర్నలిస్టు వేముల అయోధ్యరామయ్య మహబూబాబాద్ జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలోని నంది నగర్ ప్రాంతంలోగల ప్రభుత్వ సర్వే నంబర్ 287లో భూ ఆక్రమణలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు.

ఇసుక లారీ పట్టివేత

పెద్దవంగర: ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక లారీ పట్టుబడిన సంఘటన మండల పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి జిల్లా అడ్డగుడూర్ మండలం కేవ్లా తండాకు చెందిన భూక్యా రాములు, సూర్యాపేట జిల్లా తిర్మలగిరి పరిధిలోని పాలేరు వాగు నుంచి సోమవారం రాత్రి తొర్రూరుకు టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్నారు. ఈ క్రమంలో పెట్రోలింగ్ చేస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గొర్రెలు మృతి

మరిపెడ రూరల్: లచ్యతండాకు చెందిన రైతు బానోతు వీరన్న మేత కోసం గొర్రెలను బీడు భూముల్లోకి తీసుకెళ్లాడు. అవి గడ్డి మేస్తున్న క్రమంలో తెగి ఉన్న విద్యుత్ తీగకు తగిలాయి. రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వాటి విలువ సుమారు రూ. 24వేలు ఉంటుందని బాధితుడు వీరన్న బోరున విలపించాడు.

రైతు, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా కేంద్రం



మాట్లాడుతున్న అశోక్

తొర్రూరు: రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా విధానాలు రూపొందిస్తూ కేంద్రం ఆ వర్గాల నడ్డివిరుస్తోందని సీఐటీయూ జిల్లా నాయకులు బొల్లం అశోక్ అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలో సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. అశోక్ మాట్లాడుతూ.. మోదీ రైతులను ఇబ్బందులు పెడుతున్నాడనారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు సోమిరెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ జమ్ముల శ్రీను, నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిమల్లు, వెంకటేశ్వర్లు, మల్లయ్య, సాంబయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల ప్రదానం





పెద్దవంగర/గార్ల: ఇటీవల జిల్లా కేంద్రంలో దీన్ దయాల్ సతత్ వికాస్ 2022 పురస్కారాల్లో భాగంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్ చేతుల మీదుగా పెద్దవంగరలోని వడ్డెకొత్తపల్లి సర్పంచ్ నెమరుగొమ్ముల ప్రవీణ్ రావు, జీపీ కార్యదర్శి మురళి, గార్ల, సీతంపేట గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు అజ్మీర బన్సీలాల్, లావణ్య అవార్డులు అందుకున్నారు.